సాక్షి అనంతపురం

శుక్రవారం । 16 । మే । 2025



కంచె.. చేను మేసింది!

ఆర్టీసీలో అధికారి ధనదాహానికి 60 మంది సిబ్బంది బలయ్యారు. విచారణలో వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. 8లో



టన్ను చీనీ రూ.32 వేలు

అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.32 వేలు, కనిష్టం రూ.4,250 ప్రకారం ధర పలికాయి.

గరిష్టం/కనిష్టం
38.6°/21.1°

వర్షప్రభావంతో జిల్లాలో గురువారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. వేసవి తాపం అధికంగా కొనసాగుతోంది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

21న జెడ్పీ సర్వసభ్య సమావేశం



అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 21న నిర్వహించనున్నట్లు డిప్యూటీ సీఈఓ జి.వెంకటసుబ్బయ్య తెలిపారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు అనంతపురంలోని జిల్లా పరిషత్ సమావేశ ప్రధాన మందిరంలో చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన సమావేశం ప్రారంభమవుతుందని వెల్లడించారు. సీఈఓ రాజోలి రామచంద్రారెడ్డి చర్చ ప్రారంభిస్తారని, గత సమావేశంలో ప్రజాప్రతినిధులు చర్చించిన అంశాలకు సంబంధించి అధికారులు ఏం చర్యలు తీసుకున్నారనే విషయంపై సమగ్ర వివరాలతో హాజరుకావాలని ఆదేశించారు. మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు సహా జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు హాజరయ్యే సమావేశానికి అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు హాజరుకావాలని స్పష్టం చేశారు. గైర్హాజరైతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఏపీ ఈసెట్‌లో 91.71 శాతం ఉత్తీర్ణత



రఫీబ్‌ఖాన్

అనంతపురం: ఏపీ ఈసెట్‌లో జిల్లాకు చెందిన విద్యార్థులు 91.71 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈసెట్‌కు మొత్తం 2,538 మంది దరఖాస్తు చేసుకున్నారు. 2,448 మంది పరీక్షకు హాజరయ్యారు. 2,245 మంది అర్హత మార్కులు సాధించారు. బాలురు 1,735 మంది దరఖాస్తు చేసుకోగా 1,668 (91.25శాతం) మంది పరీక్షకు హాజరయ్యారు. 1,522 మంది అర్హత సాధించారు. బాలికలు 803 మంది దరఖాస్తు చేసుకోగా, 780 మంది పరీక్ష రాశారు. 723 (92.69 శాతం) మంది అర్హత సాధించారు.

రాయలచెరువు విద్యార్థికి ఫస్ట్ ర్యాంక్

యాడికి: ఈసెట్ ఫలితాల్లో మండలంలోని రాయలచెరువు గ్రామానికి చెందిన టోపీఖాన్ కుమారుడు రఫీబ్ ఖాన్ సత్తా చాటాడు. 200 మార్కులకు 96 మార్కులు సాధించి జిల్లాలో మొదటిస్థానంలో నిలిచాడు. విద్యార్థి రఫీబ్ ఖాన్‌ను స్థానికులు అభినందించారు.

గవర్నర్ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్

అనంతపురం అర్బన్: రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ జిల్లా పర్యటనకు ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గవర్నర్ ఈనెల 17న జేఎన్‌టీయూ స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు జిల్లాకు విచ్చేయనున్నారు. ఆ రోజున గవర్నర్ విడిది చేయనున్న ఆర్‌అండ్‌బీ అతిథి గృహాన్ని కలెక్టర్ గురువారం సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. అతిథి గృహంలోని గదులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అతిథి గృహం పరిశుభ్రంగా ఉండాలని, ఆవరణను శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. సోఫాలు, ఫర్నీచర్, ఏసీలు మరమ్మతు చేయించాలని సూచించారు. నీటి సరఫరా, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. పోలీసు బందోబస్తు పటిష్టంగా ఉండాలని, అతిథి గృహాన్ని ఒక రోజు ముందే ఆధీనంలోకి తీసుకోవాలని టూటౌన్ సీఐ శ్రీకాంత్‌కు చెప్పారు. లైజనింగ్ అధికారులు, సిబ్బంది తప్ప ఇతరులెవరినీ లోపలికి అనుమతించకూడదన్నారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ శివ్ నారాయణ్ శర్మ, ఆర్డీఓ కేశవ నాయుడు, డిప్యూటీ కలెక్టర్ రామ్మోహన్, ఆర్‌అండ్‌బీ డీఈఈ కాటమయ్య, పౌర సరఫరాల శాఖ డీఎం రమేష్‌రెడ్డి, డీఎస్‌ఓ జగన్మోహన్‌రావు, తహసీల్దార్లు హరికుమార్, బ్రహ్మయ్య, రియాజ్‌బాషా, ఆర్‌ఐ సందీప్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎంటెక్, ఫార్మాడీ ఫలితాల విడుదల

అనంతపురం: ఎంటెక్, ఫార్మాడీ ఫలితాలు విడుదలయ్యాయి. జేఎన్‌టీయూ (ఏ) పరిధిలో మార్చిలో నిర్వహించిన ఫార్మాడీ, ఎంటెక్ నాలుగో సంవత్సరం రెగ్యులర్, సప్లిమెంటరీ ఫలితాలను గురువారం వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు విడుదల చేశారు. ఫలితాల కోసం జేఎన్‌టీయూ(ఏ) వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు.

బెంబేలెత్తించిన వాన



రాప్తాడు మండలం అయ్యవారిపల్లి వద్ద ఉధృతంగా పారుతున్న పండమేరు వంక

ఉన్నట్లుండి ముంచుకొచ్చింది. ఒక్కసారిగా విరుచుకుపడింది. ఉరిమి ఉరిమి గడగడలాడించింది. పంటలకు నష్టం కలిగించింది. జీవాలను బలితీసుకుంది. భారీ వృక్షాలను సైతం నేలకూల్చింది. జిల్లాలో పలు చోట్ల వాన బీభత్సం సృష్టించింది. వరదతో ముంచెత్తింది. వర్షానికి తోడుగా మెరుపులు, ఉరుములు, భీకర గాలులు దడ పుట్టించాయి.

- జిల్లావ్యాప్తంగా 27 మండలాల్లో వాన
- రాప్తాడులో కుండపోత
- రికార్డు స్థాయిలో 141.2 మి.మీ వర్షపాతం
- కాలనీలు జలమయం.. విద్యుత్ సరఫరాకు అంతరాయం
- పలు చోట్ల పంటలకు నష్టం
- జీవాల మృత్యువాత



రాప్తాడు మండలం సీపీఐ కాలనీలో స్థానికులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న దృశ్యం

రాప్తాడురూరల్/అనంతపురం అగ్రికల్చర్:

రాప్తాడు: జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. 27 మండలాల పరిధిలో 16.9 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. రాప్తాడులో రికార్డు స్థాయిలో 141.2 మి.మీ వర్షపాతం నమోదైంది. అలాగే, కళ్యాణదుర్గం 53.2 మి.మీ, ఆత్మకూరు 38, బ్రహ్మసముద్రం 35, బుక్కరాయసముద్రం 34.2, శెట్టూరు 27.6, పామిడి 26.4, నార్పల 25.6, అనంతపురం మండలంలో 24.6 మి.మీ వర్షం కురిసింది. కణేకల్లు, బొమ్మనహాళ్, విడపనకల్లు, ఉరవకొండ మినహా మిగతా మండలాల్లో మోస్తరుగా వాన పడింది.

వణికిన రాప్తాడు..

రాప్తాడు మండలాన్ని వరుణుడు బెంబేలెత్తించాడు. మండలంలోని సీపీఐ కాలనీని వాన నీరు ముంచెత్తాయి. పలువురు స్థానికులు ఇళ్లపైకి వెళ్లి ప్రాణాలు కాపాడుకున్నారు. వరద నీటిలో చిక్కుకున్న ప్రజలను గురువారం ఉదయం అగ్నిమాపక సిబ్బంది తాళ్లు, ట్యూబుల సహాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

- అనంతపురం రూరల్ పరిధి కక్కలపల్లి పంచాయతీలోని బీజేపీ కొట్టాలు, ప్రజాశక్తి నగర్, ఆర్డీటీ కాలనీల్లో దాదాపు 90 ఇళ్లల్లోకి నీరు చేరాయి. గురువారం తెల్లవారుజాము 4 గంటల నుంచి ఒక్కసారిగా ఇళ్లలోకి నీళ్లు చేరడం ప్రారంభించాయి. దీంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. బతుకు జీవుడా అంటూ పిల్లాపాపలతో బయటకు పరుగులు తీశారు. వాన నీరు ఇంట్లో చేరడంతో నారాయణ ఇంట్లో దాదాపు 20 ప్యాకెట్ల బియ్యం, కందిబేడలు తడిసిపోయాయి. నరసింహులు, నాయక్‌లు వ్యాపార నిమిత్తం తెచ్చుకున్న ఎండు కర్జూరం, 2 టన్నుల మామిడిపండ్లు పూర్తిగా తడిసిపోయాయి. ఎంపీడీఓ దివాకర్, ఈఓఆర్డీ వెంకటనాయుడు కాలనీల్లో పర్యటించారు. బాధితుల వివరాలను సేకరించారు.
- బీజేపీ కాలనీ పక్కన నెట్టెం ఆనంద్‌నాయుడు అనే వ్యక్తి వంకను ఆక్రమించి వెంచర్ ఏర్పాటు చేయడంతో వర్షం నీరు ఇళ్లలోకి చేరిందని స్థానికులు వాపోయారు. డ్రైనేజీని ఆక్రమించడంతో దుస్థితి నెలకొందని చెబుతున్నారు.
- కాటిగానికాలువకు చెందిన రైతు రామచంద్ర తన ఎకరా భూమిలో సాగు చేసిన బీరపంట మొత్తం నీటిలో మునిగిపోయింది. రామినేపల్లి గ్రామంలో రాగే లక్ష్మీనారాయణ అనే రైతు 1.80 ఎకరాల్లో 2 నెలల క్రితం సాగు చేసిన 2 వేల అరటి మొక్కలు కొట్టుకుపోయాయి. ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్మించిన చెక్‌డ్యాంకు రామయ్య అనే వ్యక్తి రంధ్రం వేశాడని, దీంతో నీరు తన పొలంలోకి చేరి పంట మొత్తం దెబ్బతిందని రామచంద్ర వాపోయాడు. మరో 15 రోజుల్లో కోత పెట్టాల్సిన సమయంలో ఇలా జరిగిందంటూ ఆవేదన వ్యక్తం చేశాడు.
- వాన నీటితో పంగల్‌రోడ్డు సమీపంలోని శిల్పా లేపాక్షి నగర్‌లో పలు ఇళ్లు నీట మునిగాయి. ఆక్రమణల కారణంగానే ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పలువురు పేర్కొన్నారు.

పంటలకు తీవ్ర నష్టం..

వర్షం ధాటికి జిల్లాలో పలు చోట్ల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. అనంతపురం, కళ్యాణదుర్గం మండలాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటలకు రూ.15 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు. అక్కడక్కడా కరెంటు స్తంభాలు, వృక్షాలు నేలకూలాయి. కక్కలపల్లి సబ్‌స్టేషన్‌లోకి నీళ్లు చేరడంతో చాలా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఈ వర్షాలు ఖరీఫ్ పంటల సాగుకు వీలుగా భూములు దుక్కులు చేసుకునేందుకు ఉపయోగపడతాయని శాస్త్రవేత్తలు తెలిపారు.

చచ్చిపోతామనుకున్నాం



గురువారం తెల్లవారుజాము 3 గంటల సమయంలో వర్షపు నీరు ఇంట్లోకి వస్తుందని నా భార్య చెప్పింది. లేచి చూసే లోపే మరింత ఉధ్రుతంగా రావడం ప్రారంభించాయి. మంచంపైకి కూడా నీరు చేరాయి. ఇద్దరం చచ్చి పోవడం ఖాయమని ఏడ్చుకుంటూ దేవుడిపై భారం వేశాం. తెల్లవారాక అధికారులు వచ్చి మమ్మల్ని కాపాడారు.

– చెంద్రాయుడు, సీపీఐ కాలనీ, రాప్తాడు మండలం







కాటిగానికాలువ గ్రామానికి చెందిన రైతు రామచంద్ర సాగు చేసిన బీర పంట పూర్తిగా మునిగిపోయిన దృశ్యం, రాప్తాడు మండలం సీపీఐ కాలనీలో వాన నీటిలో స్థానికుల కష్టాలు, వాననీటిలో అవస్థలు పడుతూ నడుస్తున్న వృద్ధులు, పిల్లలు

ఐదురోజులు వర్షసూచన



ముందస్తు నైరుతి నేపథ్యంలో రానున్న ఐదు రోజులూ జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.విజయశంకరబాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం జిల్లాలో కొన్ని ప్రాంతాలకు భారీ వర్షసూచన తెలియజేస్తూ 'ఎల్లో అలర్ట్' ప్రకటించినట్లు పేర్కొన్నారు. 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులతో పాటు ఉరుములు, మెరుపులకు సంబంధించి వచ్చే రెండు రోజులు 'ఆరెంజ్ అలర్ట్' ప్రకటించినట్లు తెలిపారు. ఈ నెల 17 నుంచి 19 వరకు ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షాలు పడే సూచన ఉన్నట్లు తెలిపారు.

పిడుగు పాటుకు ఆవు, కోళ్లు మృతి



మదిగుబ్బ వద్ద పిడుగు పాటుకు మరణించిన ఆవు

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా గురువారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిశాయి. మండలంలో మదిగుబ్బ సమీపంలోని కాశిరెడ్డి నాయన ఆశ్రమం వద్ద ఓ చెట్టుపై పిడుగు పడింది. ఈ క్రమంలో సమీపంలో ఆవు, కోళ్లు మరణించాయి.



ప్రజాశక్తి నగర్‌లో వాననీటిలో తడిసిపోయిన సామగ్రి

కానరాని 'ఖరీఫ్' సన్నాహకాలు

- 15 రోజుల్లో ముంగారు
- అరకొర విత్తన కేటాయింపులతో సరిపెట్టిన కూటమి సర్కారు
- రాయితీ, ధరలు కూడా ఖరారు చేయని వైనం



అనంతపురం అగ్రికల్చర్: 'ఖరీఫ్' సీజన్ సమీపిస్తోంది. 15 రోజుల్లో అంటే జూన్ ఒకటి నుంచి ముంగారు మొదలు కానుంది. ఖరీఫ్ పంటలకు కీలకమైన 'నైరుతి రుతుపవనాలు' ఈ సారి ముందస్తుగానే రానున్నాయని భారత వాతావరణ శాఖ ఇప్పటికే ప్రకటించింది. జిల్లాలో అక్కడక్కడా వర్షాలు కూడా కురుస్తున్నాయి. 3.43 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో వేరుశనగ, కంది, పత్తి, ఆముదం, మొక్కజొన్న తదితర పంటలు సాగులోకి వస్తాయని అంచనా వేశారు. అయితే, సమయం దగ్గర పడుతున్నా వ్యవసాయశాఖ మొద్దునిద్ర పాటిస్తోంది. ఖరీఫ్ సాగుకు రైతులను సమాయత్తం చేయకుండా మిన్నకుండిపోతోంది. కేవలం 54 వేల క్వింటాళ్లతో విత్తన ప్రణాళిక ప్రకటించినా... రాయితీ, ధరలు మాత్రం ఇంకా ఖరారు చేయలేదు. అధికారులు సన్నాహక చర్యలు కూడా మొదలు పెట్టకపోవడంతో రైతులు సందిగ్ధంలో ఉన్నారు.

'అన్నదాత సుఖీభవ' కోసం ఎదురుచూపు..

ఎన్నికల సమయంలో చంద్రబాబు గొప్పగా ప్రకటించిన 'అన్నదాత సుఖీభవ' పథకం అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ఏడాదిపాటు కాలయాపన చేసింది. అయితే, త్వరలోనే పథకం అమలు చేస్తామని ఇటీవల ప్రకటించారు. 'ఏడాదికి రూ.20 వేలు' అంటూ ఘనంగా ప్రకటించిన చంద్రబాబు నేతృత్వంలోని కూటమి సర్కారు... ఇప్పుడేమో 'పీఎం కిసాన్'తో కలిపి తమ ప్రభుత్వం వాటా కింద మూడు విడతల్లో రూ.14 వేలు ఇస్తామని ప్రకటించింది. ఆ సాయం కూడా అందించకపోవడంతో ఖరీఫ్ పెట్టుబడుల కోసం రైతన్నలు ఎదురుచూస్తున్న పరిస్థితి నెలకొంది. రైతు జాబితాలకు ఎలాగైనా కొర్రీలు పెట్టాలనే ఆలోచనతో వెరిఫికేషన్ చేయిస్తున్నారు. పంటల బీమా కింద 2023 ఖరీఫ్‌కు సంబంధించి ఇప్పటికీ పరిహారం ఇవ్వలేదు. 2024 ఖరీఫ్ బీమాపై కూడా స్పష్టత లేదు. ఏడాది కాలంగా అకాల వర్షాలు, కరువు మండలాలకు సంబంధించి పెట్టుబడి రాయితీ (ఇన్‌పుట్ సబ్సిడీ) ఇవ్వలేదు. అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాల్లో ఒక్కరికి కూడా ఎక్స్‌గ్రేషియా ఇవ్వకుండా దాటవేత ధోరణి అవలంబిస్తున్నారు. పంట రుణాలకు సంబంధించి సున్నా వడ్డీ లేదు.. పావలా వడ్డీ జమ చేయలేదు. రైతులకు మేలు చేసే ఒక్క పథకమైనా, కార్యక్రమమైనా అమలు చేయకుండా చంద్రబాబు సర్కారు నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోంది.

ఎస్‌బీఐకి వినియోగదారుల ఫోరం వడ్డింపు



అనంతపురం: ''ఖాతాదారుడికి తెలియకుండా లావాదేవీలు జరిగితే అందుకు బ్యాంకుదే బాధ్యత''అని అనంతపురం జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు ఎం. శ్రీలత అన్నారు. ఖాతాదారు ప్రమేయం లేకుండా ఖాతా నుంచి విత్‌డ్రా అయిన మొత్తాన్ని ఎస్‌బీఐ (స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) తిరిగి చెల్లించాలని ఆదేశించారు. వివరాలు.. అనంతపురానికి చెందిన ఎస్. సునీత డాక్టర్ అంబేడ్కర్ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. ఆమె బ్యాంకు ఖాతా నుంచి గుర్తు తెలియని వ్యక్తులు మే 2023లో ఆధార్ గుర్తింపు ఆధారిత పేమెంట్ వ్యవస్థ (ఏఈపీఎస్) ద్వారా ఐదు విడతలుగా రూ.40,200 విత్ డ్రా చేశారు. దీంతో ఆమె ఆ మరుసటి రోజే (మే 24, 2023) బ్యాంక్ మేనేజర్‌తో పాటు పోలీసులకూ ఫిర్యాదు చేశారు. 15 రోజుల్లో తిరిగి జమ చేస్తామని చెప్పిన బ్యాంకు అధికారులు ఆ మేరకు చర్యలు తీసుకోలేదు. దీంతో సునీత వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. ఈ కేసును గురువారం జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు ఎం. శ్రీలత, సభ్యుడు బి. గోపీనాథ్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. ఎస్‌బీఐ అధికారులు హాజరయ్యారు. ఆధార్ గుర్తింపు ఆధారిత పేమెంట్ విధానంలో వేలిముద్ర గుర్తింపు ఉపయోగించి ఐదు విడతల్లో రూ.40,200 నగదు డ్రా చేశారని, ఇందుకు తాము బాధ్యత వహించబోమని తమ వాదన వినిపించారు. ప్రతి లావాదేవీకి మొబైల్‌కు మెసేజ్ కూడా పంపినట్లు తెలిపారు. అయితే, కమిషన్ పరిశీలనలో ఈ అంశం నిరూపణ కాలేదు. ఆర్‌బీఐ 2017లో జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఖాతాదారులకు సమాచారం ఇవ్వకుండా జరిగిన లావాదేవీలకు బ్యాంకు బాధ్యత వహించాల్సి ఉంటుందని కమిషన్ చైర్‌పర్సన్ అన్నారు. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుని సునీత ఖాతా నుంచి అనధికారికంగా విత్‌డ్రా అయిన రూ.40,200 మొత్తానికి 6 శాతం వడ్డీతో ఈ నెల 23వ తేదీలోపు చెల్లించాలని తీర్పు వెలువరించారు. సేవాలోపానికి రూ,10 వేలు, ప్రయాణ ఖర్చులకు మరో రూ.5 వేలు 45 రోజుల్లో చెల్లించాలని ఆదేశించారు.

ఉద్యోగుల బదిలీలకు వేళాయె

అనంతపురం అర్బన్: ఉద్యోగుల బదిలీలకు సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జూన్ 2వ తేదీ వరకు అవకాశం కల్పించింది. జూన్ 3 నుంచి బ్యాన్ అమలులోకి వస్తుందని స్పష్టం చేశారు. ఈనెల 31వ తేదీ నాటికి ఒకే చోట ఐదేళ్లు సర్వీసు పూర్తి చేసుకున్నవారికి బదిలీ తప్పనిసరి. బదిలీల్లో కొన్ని కేటగిరీల ఉద్యోగులకు ప్రాధాన్యత కల్పించారు. అంధులైన ఉద్యోగులు, బుద్ధిమాంద్యం సంతానం కలిగిన వారు, గిరిజన ప్రాంతాల్లో రెండేళ్లకు మించి పనిచేసిన వారు, 40 శాతం.. అంతకంటే ఎక్కువ వైకల్యం కలిగిన ఉద్యోగులు, క్యాన్సర్, గుండె శస్త్రచికిత్స బాధితులు, న్యూరోసర్జరీ, కిడ్నీ మార్పిడి తదితర కేటగిరీ ఉద్యోగులు లేదా ఈ వ్యాధులతో వారి స్పౌజ్ లేదా పిల్లలు బాధపడుతున్న ఉద్యోగులు, వితంతు ఉద్యోగినులకు ప్రాధాన్యత కల్పిస్తారు.







మంగళ సూత్రాన్ని భక్తులకు చూపుతున్న అర్చకులు, పసుపు తాడును బాలిక శ్రీధన్య మెడలో కడుతున్న తల్లి శ్వేత, కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు హాజరైన భక్తులు

కమనీయం.. కల్యాణం

రాయదుర్గం: పట్టణంలోని కోటలో వెలసిన ప్రసన్న వేంటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణోత్సవం గురువారం కమనీయంగా సాగింది. పద్మశాలీయ వంశం అరవ తెగకు చెందిన శ్రీనివాసులు, శ్వేత దంపతుల కుమార్తె శ్రీధన్యతో స్వామి వారి వివాహం ఘనంగా జరిపించారు. అంతకు ముందు భక్త మార్కండేయుని ఆలయం వద్దకు వేంకటేశ్వరుడి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లారు. వధువును ఆమె ఇంటి నుంచి ఆలయం వద్దకు తీసుకొచ్చారు. సంప్రదాయ పద్ధతుల్లో తాంబూలాలు మార్చుకున్న అనంతరం పెళ్లి మంటపం వరకు భారీ ఊరేగింపుతో తీసుకొచ్చారు. అర్చకులు శుభ ముహూర్తంలో వేంకటేశ్వరుడి వివాహం జరిపించారు. శ్రీధన్య మెడలో తల్లి శ్వేతతో పసుపుతాడు కట్టించారు. ఉత్సవాన్ని తిలకించేందుకు వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులకు వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొని ఉపేంద్రారెడ్డి, కేకేటీ వెంకటేశులు, బీఎస్‌టీ తిప్పేస్వామి సహకారంతో లడ్డూలు పంపిణీ చేశారు.

క్లుప్తంగా

అక్లాండ్‌లో వైఎస్సార్‌సీపీకి అపూర్వ ఆదరణ



ఆలూరు సాంబశివారెడ్డికి స్వాగతం పలుకుతున్న ప్రవాసాంధ్రులు

అనంతపురం కార్పొరేషన్: న్యూజిలాండ్‌లోని అక్లాండ్‌లో వైఎస్సార్‌సీపీకి అపూర్వ ఆదరణ లభించింది. పార్టీ కార్యకలాపాల్లో ప్రవాసాంధ్రులను మమేకం చేసేలా వైఎస్సార్‌సీపీ ఎన్‌ఆర్‌ఐ విభాగం కోఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి గురువారం అక్లాండ్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు వైఎస్సార్‌సీపీ న్యూజిలాండ్ కన్వీనర్ బుజ్జిబాబు నెల్లూరు, కో కన్వీనర్లు ఆనంద్ ఎద్దుల, సమంత్ డేగపూడి, తదితర ప్రవాసాంధ్రులు ఘన స్వాగతం పలికారు. శుక్రవారం అక్లాండ్‌లోని గ్లోబల్ కనెక్ట్ మీటింగ్‌లో ఆలూరు సాంబశివారెడ్డి ప్రసంగించనున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన విప్లవాత్మక సంస్కరణలు, సంక్షేమ పథకాల అమలు, తదితర అంశాలపై చర్చించనున్నారు. భవిష్యత్తులో పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు ఎన్‌ఆర్‌ఐలు చేపట్టాల్సిన చర్యలపై ఆయన సూచనలు, సలహాలు ఇవ్వనున్నారు.

యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ చాటిన ఉమ్మడి జిల్లాలోని యాదవ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నారు. ఈ మేరకు సక్కారామారావు ఎడ్యుకేషనల్, కల్చరల్ ట్రస్ట్ బోర్డు, యాదవ సంఘం, యాదవ ఉద్యోగులు, ప్రొఫెషనల్స్ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఆయా సంఘాల ప్రతినిధులు జి.నాగభూషణం, జి.శ్రీనివాసులు, రామకృష్ణ, ఎం.శ్రీరాములు, ఉమాశంకర్, హేమంత్, లక్ష్మీనారాయణ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. 10వ తరగతిలో 400పైబడి మార్కులు, ఇంటర్‌లో 700పైబడి మార్కులు సాధించిన విద్యార్థులు అర్హులు. జూన్ 1న పురస్కారాలు అందజేయనున్నారు. పూర్తి వివరాలకు 83094 75846, 94922 87710లో సంప్రదించవచ్చు.

కంచె.. చేను మేసింది!

- ఆర్టీసీలో అధికారి ధన దాహానికి 60 మంది బలి
- జోనల్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారి ముజఫర్ రహిమాన్ నయా దందా
- పక్కా ఆధారాలతో ఎండీకి నివేదిక
- విచారణలో వెలుగు చూస్తున్న వాస్తవాలు
- రోజుకో మలుపు తిరుగుతున్న అక్రమాల బాగోతం
- వసూళ్లకు 9 మంది ఏజెంట్లు
- రూ.కోట్లలో దండుకున్న వైనం

Name of the Security Staff (S/Sri)	Staff No.	
KV Reddy	409330	R
NPLNV Prasad	413864	R
UNS Reddy	411552	R
GVG Ramana	**409327**	R
A Manohar	676046	R
KRC Reddy	411883	R
RMS Naik	428654	R
P Sravan Kumar	413858	R
R Sankaraiah	409488	R

విచారణ అధికారులు గుర్తించిన సెక్యూరిటీ అధికారి ముజఫర్ ముఠాలోని 9 మంది సభ్యులు



అనంతపురంలోని ఆర్టీసీ బస్టాండు

అనంతపురం క్రైం: క్రమ శిక్షణకు మారుపేరుగా ఉన్న ఆర్టీసీలో ఉన్నతాధికారులే దారి తప్పారు. కింది స్థాయి ఉద్యోగులకు పర్యవేక్షకులుగా ఉండాల్సిన వారే దిక్కుమాలిన పనులు చేసి అడ్డంగా దొరికిపోయారు. కొంత కాలంగా ఆర్టీసీ జోనల్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారిగా పని చేసిన ముజఫర్ రహిమాన్ అక్రమాల బాగోతం ప్రస్తుతం ఆ సంస్థను కుదిపేస్తోంది. అతనిపై చర్యలు తీసుకున్నా.. నేటికీ ఇంకా ఆయన బాధితులు కార్యాలయానికి క్యూ కడుతూనే ఉన్నారు. ఏకంగా 9 మంది ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని సుమారు రూ. 2 కోట్లకు పైగా ఆయన దోచుకున్నట్లు అధికారికంగా గుర్తించారు. విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో ఈ లెక్క మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులే చెబుతుండడం గమనార్హం.

60 మందికి పైగా బాధితులు

అనంతపురం, కర్నూలు, వైఎస్సార్ జిల్లాల పరిధిలో సుమారు 60 మందికిపైగా ముజఫర్ రహిమన్ బాధితులున్నట్లు విచారణాధికారులు గుర్తించారు. వీరందరినీ కార్యాలయానికి పిలిపించి విచారణ చేపట్టారు. కొందరు మహిళా ఉద్యోగుల విషయంలోనూ ముజఫర్ అసభ్యంగా ప్రవర్తించినట్లు విశ్వసనీయ సమాచారం. కింది స్థాయి సిబ్బందిపై చిన్నపాటి ఆరోపణ వచ్చినా నేరుగా వారిని పిలిపించుకుని లోబరుచుకోవాలన్న ప్రయత్నాలు చేసినట్లుగా ఆరోపణలున్నాయి. జోన్ వ్యాప్తంగా ఇప్పటి వరకూ 29 మందిని విచారణ చేసిన అధికారులు... వారి నుంచి ముజఫర్ రూ.16,65,650లు వసూలు చేసినట్లు నిగ్గు తేల్చారు. ఇంకా విచారణ కొనసాగుతోంది. రూ.2 కోట్ల వరకు కొల్లగొట్టినట్లుగా ప్రాథమికంగా అధికారులు అంచనా వేశారు.

ముఠాను ఏర్పాటు చేసి..

ఆర్టీసీ కడప జోనల్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారి ముజఫర్ రహిమాన్ తనదంటూ ప్రత్యేక అవినీతి సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసుకుని, దోపిడీకి తెరలేపారు. మూడు జిల్లాల పరిధిలోని కీలక విభాగాల్లో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులను ఎంపిక చేసుకుని వారి ద్వారా యథేచ్ఛగా అక్రమ వసూళ్లకు పాల్పడినట్లుగా తెలుస్తోంది. అక్రమాలపై ఫిర్యాదులు వెల్లువెత్తిన నేపథ్యంలో ప్రాథమిక విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు... ముజఫర్ రహిమాన్‌కు సంబంధించిన 9 మంది ఏజెంట్లను గుర్తించారు. అనంతరం ముజఫర్‌పై సస్పెన్షన్ వేటు వేసి సమగ్ర విచారణ చేపట్టారు. ముజఫర్ ముఠాలో కీలకంగా కేవీ రెడ్డి, ఎన్‌పీఎల్ఎన్‌వీ ప్రసాద్, యూఎన్ఎస్ రెడ్డి, జీవీజీ రమణ, మనోహర్, కేఆర్‌సీ రెడ్డి, ఆర్ఎంఎస్ నాయక్, శివకుమార్, శంకరయ్య ఉన్నట్లుగా నిర్ధారించారు. ఇంకా ఈ జాబితాలో విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ విభాగానికి చెందిన మరి కొందరు ఉన్నట్లు సమాచారం.

తారస్థాయిలో అక్రమాల బాగోతం

అనంతపురం ఆర్టీసీలో ఉన్నతాధికారులు కూడా ఇదే మార్గం నడిచినట్లు ఆరోపణలున్నాయి. గుత్తి డిపోలో కొంత కాలంగా ఉద్యోగుల పనితీరుపై అనేక ఆరోపణలున్నాయి. అలాగే ఉరవకొండ ఆర్టీసీ డిపోలోనూ రూ.42 లక్షల వ్యవహారం ఇంకా ఎటూ తేలలేదు. దీనికి తోడు అనంతపురం కార్గో అధికారి అద్దె వాహనం పేరుతో చేసిన మోసంపై ఎలాంటి చర్యలూ లేవు. ఇలా అనంతపురం ఆర్టీసీలోని ఉన్నతాధికారుల అవినీతి బాగోతం కూడా వెలుగు చూస్తుండడంతో కార్మికుల్లో అసహనం రేకెత్తుతోంది. ఆర్టీసీ ఆర్ఎం స్థాయి అధికారి కూడా అక్రమాలకు పాల్పడిన వారికి దన్నుగా నిలుస్తూ వారిని కాపాడేందుకు తనవంతు ప్రయత్నం చేస్తున్నట్లుగా ఆరోపణలున్నాయి. ఈ అవినీతి అక్రమాలపై ఆర్టీసీ ఎండీ స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సంస్థ కార్మిక సంఘాల నేతలు కోరుతున్నారు. ఇదిలా ఉండగా ఆర్టీసీలోని యూనియన్‌ల నేతలు మాత్రం తాజాగా ఎండీని కలసి ఉద్యోగులు, కార్మికుల నుంచి జోనల్‌సెక్యూరిటీ అండ్ విజిలెన్స్ అధికారి ముజఫర్ రహిమాన్ బాధితులకు తిరిగి డబ్బు ఇప్పించాలని విన్నవించినట్లు తెలుస్తోంది.

మరోసారి ఫయాజ్ ఇంటికి మున్సిపల్ అధికారులు



వైఎస్సార్ సీపీ నాయకుడు ఫయాజ్ ఇంటి వద్ద అధికారులు

తాడిపత్రి రూరల్: తాడిపత్రిలో టీడీపీ నాయకుడు, మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి కక్ష సాధింపుల పర్వం కొనసాగుతోంది. కమిటీ పేరుతో మరోసారి రెవెన్యూ, మునిసిపల్ అధికారులను గురువారం వైఎస్సార్‌సీపీ నాయకుడు ఫయాజ్‌బాషా ఇంటిపైకి ఉసిగొల్పారు. పట్టణంలోని చిన్న బజారులో ఉన్న ఫయాజ్‌బాషా ఇంటి కొలతల కోసం సోమవారం మునిసిపల్ కౌన్సిల్ ఏర్పాటు చేసిన అధికారుల కమిటీ వెళ్లింది. వారం క్రితం మొదటిసారి కొలతల కోసం వెళ్లినపుడు తలుపులు మూసేశారనే పేరుతో పంచనామా జరిపి తిరిగి వెళ్లారు. రెండో సారిగా గురువారం వెళ్లిన కమిటీకి మరోసారి తలుపులు మూసి వేసి కనిపించడంతో ఇంటి కొలతలు చేపట్టకుండా మరోసారి అక్కడి నుంచి వెళ్లిపోయారు. పట్టణంలో ఎన్నో అక్రమ కట్టడాలు ఉన్నా వాటి జోలికి వెళ్లని అధికారులు.. అన్ని అనుమతులతో సక్రమంగా నిర్మించుకున్న ఫయాజ్ ఇంటిపైకి వెళ్తూ అత్యుత్సాహం ప్రదర్శిస్తుండటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బాధితురాలిపైనే కేసు నమోదు

- హోంగార్డు దాడి ఘటనలో పుట్లూరు పోలీసుల తీరు

పుట్లూరు: 'అంతా మా ఇష్టం.. మాకు ఇష్టం వచ్చినట్లు కేసులు నమోదు చేస్తాం.. మాకు అడ్డు చెప్పేదెవరు?' అంటూ పుట్లూరు పోలీసులు వ్యవహరించిన తీరు విమర్శలకు తావిచ్చింది. వివరాలు... పుట్లూరు మండలం కడవకల్లు గ్రామానికి చెందిన తనుజపై పక్కనే నివాసం ఉంటున్న హోంగార్డు రాజశేఖర్ బుధవారం దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. ద్విచక్రవాహనంపై వెళుతూ ఆమెకు కాలు తగిలించడమే కాక, చూసుకుని వెళ్లమని హితవు పలికినందుకు ఆమెపై విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాడు. ఆ సమయంలో భర్త మధుసూదన్‌రెడ్డి ఉద్యోగ రీత్యా బయటకు వెళ్లడంతో బాధితురాలు ఆయనకు ఫోన్ చేసి తనపై జరిగిన దాడిని వివరించి, డయల్ 100 ద్వారా పోలీసులను ఆశ్రయించింది. అయితే దాడికి పాల్పడిన హోంగార్డు రాజశేఖర్‌పై కాకుండా బాధితురాలు తనుజ, ఆమె భర్త మధుసూదన్‌రెడ్డిపై పుట్లూరు పోలీసులు కేసు నమోదు చేసి తమ వైఖరిని బయటపెట్టుకున్నారు. దాడికి కారకుడైన హోంగార్డుపై కాకుండా బాధితురాలైన తనతో పాటు సంఘటన జరిగిన సమయంలో అక్కడ లేని తన భర్తపై కూడా పోలీసులు కేసు నమోదు చేయడం అన్యాయమని బాధితురాలు కన్నీటిపర్యంతమైంది. కాగా, తమపై నమోదైన కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్ ఇవ్వాలని కోరగా ఎస్ఐ నరసింహ నిరాకరించడాన్ని తప్పుబట్టారు. ఈ విషయాన్ని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు తమకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని బాధితురాలు తెలిపారు.

యువకుడి అనుమానాస్పద మృతి

అనంతపురం: స్థానిక అశోక్‌నగర్‌లో నివాసముంటున్న ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. వన్‌టౌన్ సీఐ వి.రాజేంద్రనాథ్ యాదవ్ తెలిపిన మేరకు... ఉరవకొండ మండలం నిమ్మగల్లుకు చెందిన తిప్పేస్వామి కుమారుడు శివప్రసాద్ (22) అనంతపురంలో డీజేగా పనిచేస్తున్నాడు. ఈ నెల 12న ఉదయం ఉరవకొండ నుంచి అనంతపురానికి వచ్చి అశోక్‌నగర్‌లోని తన స్నేహితులతో కలిసి రూంలో ఉంటున్నాడు. కియా పరిశ్రమలో పనిచేస్తున్న స్నేహితులందరూ బుధవారం విధులకు వెళ్లి రాత్రి 2 గంటలకు గదికి చేరుకున్నారు. అప్పటికే గదిలో నిద్రపోతున్న శివకుమార్ లేచి తలుపు తీసి, కాసేపు మాట్లాడి తిరిగి గదిలోనే నిద్రపోయాడు. గురువారం ఉదయానికి మృతి చెంది కనిపించడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. టవాల్‌తో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లుగా స్నేహితులు తెలిపారు. అయితే టవాల్‌తో ఉరి వేసుకోవడం సాధ్యం కాదనే వాదనలు వినిపించాయి. ఘటనపై కుటుంబసభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయడంతో ఆ దిశగా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కారు దగ్ధం



మంటల్లో కాలిపోతున్న కారు

ధర్మవరం రూరల్: మండలంలోని చిగిచెర్ల గ్రామ సమీపంలో మంటలు చెలరేగి కారు దగ్ధమైంది. వెనిల్ అనే వ్యక్తితో కలసి మరో వ్యక్తి అనంతపురం నుంచి కారులో ధర్మవరానికి బయలుదేరాడు. చిగిచెర్ల సమీపంలోకి చేరుకోగానే ఒక్కసారిగా కారులో నుంచి పొగలు రాసాగాయి. గమనించిన వారు కారు ఆపి కిందకు దిగారు. అప్పటికే మంటలు ఎగిసిపడ్డాయి. మంటలు ఆర్పేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఘటనపై ధర్మవరం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

గెలుపునకు అడ్డదారులా?

- గొర్రెల, మేకల పెంపకందారుల ప్రాథమిక సహకార సంఘం ఎన్నికల్లో వంచనకు తెరలేపిన అధికారులు
- ఎన్నికలు వాయిదా వేసిన తర్వాత జాబితాలో కొత్తగా 67 మంది చేర్పు



మాట్లాడుతున్న మలరాయుడు, శివప్రసాద్

ఆత్మకూరు: గొర్రెల, మేకల పెంపకందారుల ప్రాథమిక సహకార సంఘం ఎన్నికల్లో గెలిచేందుకు టీడీపీ నేతలు అడ్డదారులు తొక్కుతున్నారని, ఇందుకు అధికారులు పూర్తి స్థాయిలో సహకరిస్తున్నారని అధ్యక్ష స్థానానికి పోటీ చేసిన మలరాయుడు, వైస్ ప్రెసిడెంట్ స్థానానికి పోటీ చేసిన శివప్రసాద్ ఆరోపించారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. గొర్రెల, మేకల ప్రాథమిక సహకార సంఘం ఎన్నికలకు ఈ ఏడాది జనవరి 25న మదిగుబ్బలో ఎన్నికలు నిర్వహించారని గుర్తు చేశారు. గ్రామంలో మొత్తం 152 మంది సభ్యులుండగా ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి మలరాయుడుకు 93 మంది, టీడీపీ మద్దతు అభ్యర్థి నరసింహులుకు 12 మంది సభ్యులు మద్దతు పలికారన్నారు. ఇది గిట్టని టీడీపీ నేతలు అధ్యక్ష స్థానం తమకే దక్కాలన్న అక్కసుతో దాదాపు 50 మంది పోలీసులను అడ్డం పెట్టుకుని గొడవ చేసి ఎన్నికలను వాయిదా పడేలా చేశారన్నారు. ఎన్నికలు వాయిదా వేసిన తర్వాత 152 సభ్యుల్లో కేవలం 90 మందికి మాత్రమే సభ్యత్వం ఉందని అధికారులు చెబుతున్నారని, అలాగే రెండు రోజుల క్రితం పశుసంవర్థక శాఖ అధికారులు గ్రామంలో పర్యటించి టీడీపీకి అనుకూలంగా ఉన్న 67 మందిని సభ్యులుగా చేర్చారని వివరించారు. ఎన్నికలు వాయిదా పడిన తర్వాత కొత్త సభ్యులను ఎలా చేరుస్తారంటూ అధికారులను ప్రశ్నించారు. 2018 నాటికి సంఘంలో 90 మంది సభ్యులు ఉన్నారని, 2019లో ప్రెసిడెంట్ స్థానానికి పోటీ చేసిన పోతిరెడ్డి 62 మందికి చలానాలు కట్టి సభ్యులుగా చేర్చారని గుర్తు చేశారు. చలానా కట్టి సభ్యులుగా పేర్లు నమోదు చేయాలంటే ఆడిట్ తప్పనిసరిగా చేయాల్సి ఉందన్నారు. 2017 నుంచి 2018 వరకు ఆడిట్ ప్రక్రియను ఎందుకు చేపట్టలేదో అధికారులకే తెలియాలన్నారు. దొంగ రసీదులు సృష్టించి అధ్యక్ష స్థానాన్ని దక్కించుకునేందుకు టీడీపీ నేతలు ఆడిన చదరంగంలో అధికారులు పావులుగా మారారన్నారు. ఈ అంశంపై పంపనూను పశువైద్యాధికారి దిలీప్‌ను వివరణ కోరగా... ఉన్నత స్థాయి అధికారుల ఆదేశాల మేరకు కొత్తగా 67 మంది సభ్యులను చేర్చినట్లు తెలిపారు. ఏపీసీఎస్ యాక్ట్ 1964 సెక్షన్ 19 ప్రకారం వారందరూ సభ్యులుగా పరిగణించబడుతారని వివరించారు.

యువకుడి మృతదేహం వెలికితీత



నీటిలో తేలుతున్న రాజశేఖర్ మృతదేహం

రాయదుర్గం టౌన్: స్థానిక దుగ్గిలమ్మ గుడి కోనేరులో స్నేహితులతో కలసి ఈతకు వెళ్లి గల్లంతైన బోయ రాజశేఖర్ (30) రెండో రోజు గురువారం మృతదేహమై నీటిలో తేలియాడుతూ కనిపించాడు. ఈత రాకపోయినా స్నేహితుల ఒత్తిళ్ల కారణంగా బుధవారం బావిలో దిగి గల్లంతైన విషయం తెలిసిందే. బుధవారం మధ్యాహ్నం నుంచి పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోయింది. గురువారం తెల్లవారుజాము నుంచినాలుగు భారీ స్థాయి ఆయిల్ మోటార్లతో బావిలో నీటిని బయటకు తోడేశారు. ఈ క్రమంలో దాదాపు 20 అడుగులకు పైగా నీటిని తోడిన తర్వాత గురువారం రాత్రి 8.30 గంటలకు రాజశేఖర్ మృతదేహం తేలియాడుతూ కనిపించింది. మృతదేహాన్ని పోలీసులు వెలికితీసి అంబులెన్సులో స్థానిక ఏరియా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

దోమకాటు నివారణ చర్యలు చేపట్టండి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి

అనంతపురం మెడికల్: దోమకాటు నివారణ చర్యలు చేపట్టి, జిల్లాలో డెంగీ, మలేరియాను తరిమికొట్టాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి పిలుపునిచ్చారు. ఈ నెల 16న డెంగీ దినాన్ని పురస్కరించుకుని గురువారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో పోస్టర్లను ఆమె ఆవిష్కరించి, మాట్లాడారు. వర్షాకాలం సీజన్‌లో దోమకాటు వ్యాధులు ప్రబలకుండా యాంటీ లార్వా పద్ధతులను పాటించాలన్నారు. హై రిస్క్ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. జాతీయ డెంగీ దినాన్ని పురస్కరించుకుని శుక్రవారం పెద్ద ఎత్తున అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డెంగీపై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని మలేరియా అధికారి ఓబులును ఆదేశించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ యుగంధర్, డాక్టర్ నారాయణస్వామి, డాక్టర్ విష్ణుమూర్తి, డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా సహాయ మలేరియా అధికారి సత్యనారాయణ, డిప్యూటీ హెచ్ఈఓ గంగాధర్; ఆఫీస్ సూపరింటెండెంట్ శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

ఉద్దేహాళ్‌లో ఆగిపోయిన ధాన్యం లారీలు



కొనుగోలు కేంద్రంలో ఆందోళన చేస్తున్న లారీ డ్రైవర్లు, ఆగిపోయిన ధాన్యం లోడ్ లారీలు

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో 20 రోజుల క్రితం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన ధాన్యం లారీల్లోనే ఆగిపోయింది. మూడు రోజులుగా ఇదే పరిస్థితి. శ్రీకాళహస్తిలో మిల్లర్లకు బ్యాంకు ష్యూరిటీ లేదని లారీలను అడ్డుకున్నారు. మూడు రోజులుగా లారీలు ఆగిపోవడంతో డ్రైవర్లు వరి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద గురువారం సాయంత్రం ఆందోళనకు దిగారు. 'మీ ధాన్యం రవాణా చేయడం కష్టం.. బస్తాలను ఇక్కడే అన్‌లోడ్ చేసుకోండి' అంటూ డిమాండ్ చేశారు. ఈ క్రమంలో బస్తాలు కిందికి దించితే తమ పరిస్థితి ఏమిటని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వీలైనంత త్వరగా తగిన నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు.

నేనే 'రాజు'... నేనే మంత్రి

- విమర్శలకు తావిస్తున్న కూడేరు పీఎస్ సీఐ రాజు వ్యవహారం



మంత్రి పయ్యావుల జన్మదిన కార్యక్రమంలో టీడీపీ నేతలతో కలిసి కేక్ కటింగ్‌లో పాల్గొన్న సీఐ రాజు

సాక్షి టాస్క్‌ఫోర్స్: కూడేరు పీఎస్ సీఐ రాజు వ్యవహారం వివాదాస్పదంగా మారింది. ఓ ప్రభుత్వ ఉద్యోగిగా కాకుండా నేనే రాజు.. నేనే మంత్రినంటూ వ్యవహరిస్తూ పోలీస్ స్టేషన్‌ను టీడీపీ కార్యాలయంగా మార్చినట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఏదైనా సమస్య ఉత్పన్నమైనప్పుడు బాధితులు ఫిర్యాదు చేసేందుకు స్టేషన్‌కు వెళితే.. టీడీపీ నాయకులు, కార్యకర్తలు తప్ప మరెవ్వరూ అక్కడ ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ జన్మదినం సందర్భంగా కూడేరు జెడ్పీహెచ్ఎస్‌లో టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన ప్రైవేట్ కార్యక్రమానికి ఏకంగా యూనిఫాంలో హాజరై ఆ పార్టీ కార్యకర్తలతో కలిసి కేక్ కటింగ్‌లు చేస్తూ హల్‌చల్ చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో కాస్త సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో మంత్రి కేశవ్‌కు సీఐ రాజు షాడోగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తాయి. ఇలాంటి అధికారి ఇక సామాన్యులకు న్యాయం ఎలా చేస్తారంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.

ప్రాథమిక పాఠశాలలను కాపాడండి

- ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్

అనంతపురం ఎడ్యుకేషన్: రాష్ట్రంలో 117 జీఓకు ప్రత్యామ్నాయంగా విడుదల చేసిన జీఓల్లో ఫౌండేషన్ ప్రాథమిక పాఠశాలల్లో 1:30 ఉపాధ్యాయ–విద్యార్థి నిష్పత్తిని పాటించారని, ఈ కారణంగా రాష్ట్రంలో చాలా ఫౌండేషన్ ప్రాథమిక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మిగిలిపోతాయని ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆప్టా రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఆర్. మురళీమోహన్, జిల్లా అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె. వెంకటరత్నం, ఆర్థిక ప్రధాన కార్యదర్శి శంకరమూర్తి గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ తీరుతో జిల్లాలో దాదాపు 500కు పైగా ఏకోపాధ్యాయ పాఠశాలలు రాబోతున్నాయన్నారు. ఇవన్నీ జీరో ఎన్‌రోల్‌మెంట్‌గా మారి శాశ్వతంగా మూతపడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవితకు ఆటంకం కలిగించే చర్యలు ఆపాలని డిమాండ్ చేశారు. సబ్జెక్టు టీచర్లుగా ఉన్న స్కూల్ అసిస్టెంట్లను బోధనకు ప్రాథమికోన్నత పాఠశాలల్లో వాడుకొని, ప్రాథమిక పాఠశాలల్లో సెకండరీ గ్రేడ్ టీచర్లకు ప్రమోషన్ కల్పించి నియమించాలనే డిమాండ్‌ను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఫౌండేషన్ ప్రాథమిక పాఠశాలల్లో 1:20 ఉపాధ్యాయ–విద్యార్థి నిష్పత్తిని పాటించడం, ప్రాథమిక పాఠశాలల్లో సెకండరీ గ్రేడ్ టీచర్లకు ప్రమోషన్ కల్పించి ప్రధానోపాధ్యాయులుగా నియమించాలన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో పూర్తి స్థాయిలో స్కూల్ అసిస్టెంట్లను కేటాయించాలన్నారు. ఉన్నత పాఠశాల్లో 45 మంది విద్యార్థులకు ఒక సెక్షన్ గా గుర్తించాలని డిమాండ్ చేశారు.

కమనీయం.. శ్రీవారి కల్యాణం



గరుడ వాహనంపై విహరిస్తున్న లక్ష్మీనారసింహుడు

ఉరవకొండ రూరల్: ఉమ్మడి జిల్లాలోనే ప్రసిద్ధి గాంచిన పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీవారి కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. జిల్లా నలమూలల నుంచే కాకుండా పొరుగున ఉన్న కర్ణాటక నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. ప్రధాన అర్చకుడు ద్వారకనాథచార్యులు, ఈఓ సాకే రమేష్‌బాబు అధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ శాస్త్రోక్తంగా శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తులకు కల్యాణం జరిపించారు. అంతకు ముందు దేవేరులతో కలసి గరుడ వాహనంపై భక్తులకు శ్రీవారు దర్శనమిచ్చారు.

క్లుప్తంగా

ముగిసిన అక్క దేవతల జాతర



ఆలయం ముందు కుంకాలు ఆడుతున్న భక్తులు

ఆత్మకూరు: మండల కేంద్రంలో వారం రోజులుగా జరుగుతున్న అక్క దేవతల జాతర గురువారం ముగిసింది. అమ్మ వార్లను ప్రత్యేకంగా పూలతో అలంకరించి విశేష పూజలు చేశారు. అనంతరం ఆలయం ఎదుట భక్తులు, పసుపు, కుంకుమతో వసంతోత్సవం నిర్వహించారు. కుంకాలు చల్లుతూ చిందులు తొక్కారు. అనంతరం రాత్రికి అక్కమ్మ దేవతల గంపను ఊరేగించారు.

రేపు లఘుచిత్ర ప్రదర్శన



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఫిల్మ్ సొసైటీ ప్రతినిధులు

అనంతపురం కల్చరల్: ప్రముఖ విద్యావేత్త మురళీధర రావుకు ఆర్ట్స్ కాలేజీతో ఉన్న అనుబంధంపై చిత్రీకరించిన లఘుచిత్రం ఈనెల 17న ప్రదర్శిస్తున్నట్లు ఫిల్మ్ డైరెక్టర్ రషీద్ తెలిపారు. గురువారం అనంతపురం క్లబ్‌లో లఘుచిత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్ట్స్ కళాశాలలో ఉదయం 10:30 గంటలకు జరిగే ప్రదర్శనకు ముఖ్య అతిథులుగా డిప్యూటీ కలెక్టర్ రామకృష్ణారెడ్డి, ఆర్ట్స్‌కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మశ్రీ, జనసేన నాయకుడు భవాని రవికుమార్ విచ్చేస్తారన్నారు. వందేళ్ల చరిత్ర కలిగిన కళాశాల గొప్పతనం పంచుకోవడానికి పూర్వ విద్యార్థులందరూ భాగస్వాములవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపాల్ మురళీధరరావు, అనంతపురం ఫిల్మ్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.


జేఎన్‌టీయూ విద్యార్థులకు ఉద్యోగాలు



విద్యార్థులతో జేఎన్‌టీయూ(ఏ) వీసీ ప్రొఫెసర్ హెచ్.సుదర్శన రావు

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరంలో మొత్తం 226 మంది విద్యార్థులకు బహుళ జాతి కంపెనీల్లో కొలువులు దక్కాయి. వీరిలో 10 మంది విద్యార్థులకు అత్యధిక వార్షిక వేతనంతో కూడిన కొలువులు వరించాయి. ఏడాదికి రూ.11 లక్షల వేతనం ఇవ్వనున్నారు. టీసీఎస్ కంపెనీలో ఫ్యాక్ట్‌సెట్‌లో విధులు నిర్వహించనున్నారు. తక్కిన విద్యార్థులకు కాగ్నిజెంట్, టీసీఎస్, ఎల్‌అండ్‌టీ, జిందాల్, అల్ట్రాటెక్ సిమెంట్, దివిస్ ల్యాబోరేటరీస్, మేధా సర్వో , కియా ఆర్వీ అసోసియేట్ , మోషిప్ కంపెనీల్లో 216 మందికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు విద్యార్థులను అభినందించారు.

వెండి సామగ్రి వితరణ



వెండి పన్నీరు బుడ్డీలు అందజేస్తున్న జయసింహారెడ్డి దంపతులు

అనంతపురం కల్చరల్: మూడవ రోడ్డు షిర్డీ సాయిబాబా మందిరానికి జయసింహారెడ్డి, శ్రీనిత్యారెడ్డి దంపతులు గురువారం సాయంత్రం వెండి పన్నీరు బుడ్డీలు వితరణ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గంగన లక్ష్మీరెడ్డి ఆధ్వర్యంలో షిర్డీ సాయిబాబాకు విశేష పూజలు, పల్లకీ సేవ, అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక సేవలందించడానికి ముందుకు వచ్చిన జయసింహారెడ్డి బృందాన్ని అభినందించారు. దూప్ హారతి అనంతరం వారికి స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మందిర కమిటీ సభ్యులు, అర్చక బృందం పాల్గొన్నారు.

పందుల అపహరణ

శింగనమల: శింగనమలలో గురువారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో గుర్తు తెలియని దొంగలు ఐదు పందులను దొంగతనం చేసినట్లు యజమానులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుమోలో ఐదు మందికి దాకా వచ్చి, గ్రామంలో తిరుగుతున్న తమ పందులను అపహరించారన్నారు. పోలీసులు విచారణ చేపట్టారు.

రెండు బైకుల ఢీ: ఇద్దరికి గాయాలు

గుత్తి: పట్టణంలోని గాంధీ సర్కిల్ సమీపంలో గురువారం రెండు బైక్‌లు ఢీ కొని సుప్రీత్ అలియాస్ బన్నీ, దినేష్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సుప్రీత్‌కు కాలు విరగడంతో వైద్యులు అనంతపురం ప్రభుత్వాస్పత్రికి రెఫర్ చేశారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



అనంతపురం: ప్రజాశక్తి కాలనీలో ప్రవహిస్తున్న వర్షపు నీరు



రాప్తాడు: నీట మునిగిన రామినేపల్లి పెద్దమ్మ గుడి



రాప్తాడు: రామినేపల్లిలో తెగిన మొరప్ప కుంట

వర్ష బీభత్సం

- రాప్తాడు మండలంలో నీట మునిగిన గ్రామాలు
- బిక్కుబిక్కుమంటున్న ప్రజానీకం
- దెబ్బతిన్న పంటలు

రాప్తాడు/అనంతపురం: అనంతపురం నగరం, రాప్తాడు మండల వ్యాప్తంగా గురువారం తెల్లవారుజామున 2 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకూ జోరువాన కురిసింది. పలు కాలనీలు, గ్రామాలు నీట మునిగాయి. రామినేపల్లి, కందుకూరు రోడ్డు సమీపంలోని సీపీఐ కాలనీ, అనంత టౌన్ షిప్ కాలనీల్లోకి నీరు చేరింది. ఇంట్లోని గృహోపకరణాలు, నిత్యావసరాలు, ద్విచక్ర వాహనాలు దెబ్బతిన్నాయి. దీంతో ఆయా కాలనీల ప్రజలు బిక్కుబిక్కు మంటూ కాలం గడుపుతున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు కాలనీ వాసులకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం వసతి కల్పించారు. గొందిరెడ్డిపల్లి, యర్రగుంట, ఎం.బండమీదపల్లి గ్రామాల్లో కురిసిన భారీ వర్షానికి రామినేపల్లి గ్రామం పడమర వైపు ఉన్న మొరప్ప కుంట నిండి మరువ పారింది. రామినేపల్లి గ్రామంలో పెద్దమ్మ, శివాలయం, ఎస్సీ కాలనీ అంతా 8 అడుగుల నీరు నిలిచిపోయింది. దాదాపు 25 ఇళ్లలో బియ్యం ప్యాకెట్లు, ఇంట్లోని గృహోపకరణాలు, ఎలక్ట్రిక్ వస్తువులు, నిత్యావసరాలు నీట మునిగి ఉపయోగం లేకుండా పోయాయి. వైఎస్సార్ సీపీ నేతకు చెందిన ఒక కారు కూడా నీట మునిగిపోయింది. అలాగే 10కి పైగా ద్విచక్ర వాహనాలు, వాటర్ ఆటో నీట మునిగాయి. అలాగే అనంత టౌన్ షిప్, ముస్లీం మైనార్టీ కాలనీ, కళాకారుల కాలనీ, దండోర కాలనీ, రాజరాజేశ్వరి, బృందావన కాలనీ లోపలికి వరద నీరు నీరు చేరడంతో ఆయా కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

• కూలిన ప్రచార బోర్డు

రామినేపల్లి గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారి పక్కనే రామినేపల్లి గ్రామానికి చెందిన కాటమయ్య అనే వ్యక్తి ఇంటిపై ప్రచార బోర్డు గాలీ వానకు పక్కనే ఉన్న బాలగొండ చిన్న లింగన్న ఇళ్లు, నారాయణ స్వామికి చెందిన షెడ్డుపై పడింది. నారాయణ స్వామి షెడ్డు కూలిపోయింది. ఆ సమయంలో నారాయణ స్వామి, అతడి భార్య పద్మావతి, కుమారుడు అభిరాం, కుమార్తె రమ్యశ్రీ ఇంట్లో మంచంపై నిద్రిస్తున్నారు. ఒక్క సారిగా షెడ్డుపై బండలు, సిమెంట్ రేకులు పడటంతో కేకలు వేస్తూ బయటకు పరుగులు తీసి ప్రాణాలు కాపాడుకున్నారు. అలాగే చిన్న లింగన్న ఇల్లు కూడా పాక్షికంగా దెబ్బతింది. ఇంట్లో పడుకున్న వాళ్ల కూడా పరుగులు తీస్తూ బయటకు వచ్చారు. కాటమయ్య ఇంటిపై ప్రచార బోర్డుకు ఉన్న రెండు దిమ్మెలు ఇంటిపైనే ఉండడంతో పెద్ద ప్రమాదం తప్పింది. నాలుగు దిమ్మెలు కింద పడి ఉంటే దాదాపుగా రెండు కుటుంబాల్లో 6 మంది పెద్దలు, నలుగురు చిన్నారులు మృతవాత పడేవారు. ఇక రామినేపల్లి, రాప్తాడు, గొందిరెడ్డిపల్లి, హంపాపురం, ఎం.బండమీదపల్లి, హంపాపురం, గొల్లపల్లి తదితర గ్రామాల్లో రైతులు సాగు చేసిన బెండ, టమోట, మిరప, దోస పంటలు నీట మునిగాయి.



బాలుడిని సురక్షిత ప్రాంతానికి తీసుకెళ్తున్న దృశ్యం

• బాధితులను ఆదుకుంటాం

గురువారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి సీపీఐ కాలనీ, రామినేపల్లి ఎస్సీ కాలనీలు నీట మునిగాయి. స్థానిక అధికారుల ద్వారా విషయం తెలుసుకున్న జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, ఆర్డీఓ కేశవ నాయుడు, తహసీల్దార్ విజయ కుమారి, ఎంపీడీఓ విజయలక్ష్మి ఆయా కాలనీలకు వెళ్లి పరిశీలించారు. అధికారులు సీపీఐ కాలనీ, రామినేపల్లి ఎస్సీ కాలనీలో జేసీబీల సహాయంతో వర్షపు నీరు లోతట్టు ప్రాంతాలకు వెళ్లేలా కాలువ తవ్వించడంతో నీరు వెళ్లిపోయింది. జాయింట్ కలెక్టర్ వెంటనే వర్ష బాధితులకు తాగునీరు, భోజనాలు అందేలా చూడాలని ఆదేశించారు. రెవెన్యూ అధికారులు ఉదయం టిఫెన్, మధ్యాహ్నం, రాత్రికి భోజన వసతి కల్పించారు.



రాప్తాడు సమీపంలో నేలకొరిగిన వేప చెట్టు

పరవళ్లు తొక్కుతున్న ‘పండమేరు’

ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షానికి పండమేరు వంక పరవళ్లు తొక్కుతోంది. గత 10 ఏళ్లుగా సరైన వర్షాలు లేక కళావిహీనంగా తయారైన పండమేరు వంక, ఒక్క రోజే భారీ వర్షంతో జలకళ వచ్చింది. ప్రస్తుతం గత నెల రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు బొమ్మేపర్తి గ్రామం వరకు మాత్రమే పండమేరు వంక ప్రవహించింది. కర్ణాటక, రామగిరి, కనగానపల్లి మండలాల్లో నుంచి వరద నీరు ప్రవహిస్తుండటంతో పండమేరు వంక పది అడుగుల నీరు ప్రవహిస్తోంది. పండమేరు వంక రాప్తాడు మీదుగా అనంతపురం చెరువులోకి భారీగా నీరు చేరింది. మహిళలు పండమేరు వంక దగ్గరకు వచ్చి పూజలు చేశారు.

రాకపోకలు బంద్..

పండమేరు వంక ఉధృతంగా ప్రవహిస్తుండటంతో మండలంలోని పాలచెర్ల-వరిమడుగు, గాండ్లపర్తి-జి.కొత్తపల్లి, వరిమడుగు-గాండ్లపర్తి, గాండ్లపర్తి-యర్రగుంట, అయ్యవారిపల్లి-రాప్తాడు, రాప్తాడు-చిన్మయనగర్ గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా బంద్ అయ్యాయి. పండమేరు వంక ఉధృతి తగ్గితే తప్ప ఆయా గ్రామాల ప్రజలు ఇతర గ్రామాలకు వెళ్లే పరిస్థితి లేదు. ఆయా గ్రామాలకు ఇతర గ్రామాలతో సంబంధాలు తెగిపోయాయి. రాప్తాడు-చిన్మయనగర్ ప్రజలు పండమేరు వంకలో 500 మీటర్ల దూరం ఉండటంతో నెల రోజుల పాటు రాకపోకలు సాగించేందుకు వీలుకాదు.



రాప్తాడు: రామినేపల్లిలో ఇంటిపై కూలిన ప్రచార బోర్డు



రాప్తాడు: వర్షానికి కొట్టుకుపోయిన అరటి మొక్కలు



సీపీఐ కాలనీ వాసులకు టిఫిన్ వడ్డిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

టీ-20 టోర్నీ విజేత ‘అనంత రైజింగ్ స్టార్’

అనంతపురం: సీనియర్ క్రికెటర్ ఎస్.చంద్రమోహన్ స్మారక క్రికెట్ సీనియర్ టీ–20 టోర్నీ విజేతగా అనంత రైజింగ్ స్టార్ నిలిచింది. గురువారం ఆర్డీటీ స్టేడియంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో అనంత రైజింగ్ స్టార్, కదిరి జట్లు తలపడ్డాయి. తొలుత అనంత రైజింగ్ స్టార్ బ్యాటింగ్ ఎంపిక చేసుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 190 పరుగులు చేసింది. అనంత రైజింగ్ స్టార్ జట్టులో బి.ప్రశాంత్ 79 పరుగులు (56 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సర్లు), తేజా రెడ్డి 23 బంతుల్లో 39 పరుగులు (ఆరు ఫోర్లు) ధాటిగా ఆడి జట్టుకు మంచి స్కోరు అందించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన కదిరి క్యాంప్ ఏడీసీఏ జట్టు 20 ఓవర్లకు 171 పరుగులు చేసి 9 వికెట్లు నష్టపోయింది. 19 పరుగుల తేడాతో అనంత రైజింగ్ స్టార్ విజేతగా నిలిచింది. టోర్నీలో మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్‌గా కేహెచ్ వీరా రెడ్డి (ఫ్యామిలీ క్లబ్), బెస్ట్ బ్యాటర్‌గా కేహెచ్ వీరారెడ్డి, బెస్ట్ బౌలర్ జి.శ్రీనివాస్ (ఫ్యామిలీ క్లబ్), బెస్ట్ వికెట్ కీపర్‌గా బి.ప్రశాంత్ (అనంత రైజింగ్ స్టార్), బెస్ట్ ఫీల్డర్‌గా అబ్దుల్లా (హిందూపురం)నిలిచారు. కార్యక్రమంలో ఏడీసీఏ జిల్లా అధ్యక్షుడు పీఎల్ ప్రకాష్ రెడ్డి, సెక్రైటరీ వి.భీమలింగా రెడ్డి, వెటరన్స్ క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మచ్చా రామలింగా రెడ్డి, ఆర్డీటీ స్పోర్ట్ డైరెక్టర్ సాయి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం



గైనిక్ షెడ్డులో ఉన్న మంచాలు

మంచాలను వినియోగిస్తే ఒట్టు..

ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో వివిధ వార్డులు, రోగులను ఎప్పటికప్పుడు పరిశీలించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మెడిసిన్, ఆర్థో, తదితర విభాగాల్లో మంచి పడకలు లేక రోగులు అవస్థలు పడుతున్న సందర్భాలు కోకొల్లలు చూశాం. ఏదైనా వార్డు పరిశీలనకు వెళితే ముందర నలుగురు సెక్యూరిటీ, వెనుకల ఇద్దరు సూపర్‌వైజర్లను ఏర్పాటు చేసుకుని హంగామా చేసే అధికారులు.. రోగుల కనీస అవసరాలను తీర్చడంలో విఫలమవుతున్నారు. సర్వజనాస్పత్రి ఆవరణలో ఉన్న గైనిక్ షెడ్డులో గత కొన్ని నెలలుగా ఖరీదైన ఐసీయూ మంచాలను మూలకు పడేశారు. వాటి ద్వారా అక్కడ బాలింతలకు ఇబ్బందికరంగా ఉంది. ఇంత జరుగుతున్నా.. అధికారులు వారి చాంబర్లను వీడడం లేదు. రోగులకు అవసరమైన ప్రాంతాల్లో మంచాలను ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

– అనంతపురం మెడికల్:

ప్రజా సమస్యలు పట్టించుకోరా?

అనంతపురం అర్బన్: బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి రూరల్ మండలం పరిధిలోని ప్రజాశక్తి కాలనీ నీటి మునిగింది. దాదాపు వంద కుటుంబాలు నష్టపోయాయని సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆ కుటుంబాలకు పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వరద నీరు ఇళ్లలోకి వస్తుండటంతో పార్టీ నాయకులతో కలిసి నీటి ప్రవాహానికి అడ్డుపడుతున్న చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వంకలకు సైడ్ వాల్స్ నిర్మిస్తామని ఎన్నికల సమయంలో నాయకులు వాగ్దానం చేశారన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కాలనీలోని ఇళ్లకు విద్యుత్ సరఫరా కావడంతో షాక్ కొడుతోందన్నారు. విద్యుత్ శాఖ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. వరదలు వచ్చినప్పుడు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు వచ్చి హడావుడి చేయడమే తప్ప సమస్య పరిష్కరించడం లేదని విమర్శించారు. పాలకులు, అధికారులు స్పందించి వంకలకు సైడ్ వాల్ నిర్మించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సమస్య పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ముత్తూజ, ఇర్ఫాన్, శ్రీనివాసులు, గౌస్, గోపాల్, అల్లాబకాష్, కుళ్లాయప్ప, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



వరద నీటికి అడ్డుపడిన చెత్తను తొలగిస్తున్న సీపీఎం కార్యకర్తలు

సీబీఎస్ఈ ఫలితాల్లో ప్రతిభ

అనంతపురం రూరల్: సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో ఎరా ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. జెతిన్ రెడ్డి 488, చరణ్‌దేవ్ 458, ద్యానా 456, ప్రతిక్షపూర్వీ 456, మహమ్మద్ ఖాజా 451, తేజస్విని 450, లిఖిత సింహ 450, శశికిరణ్ 440 మార్కులతో సత్తా చాటారు. గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ అరుణ్ కుమార్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు.

17న రాతిదూలం లాగుడు పోటీలు

పెద్దపప్పూరు: మండలంలోని కుమ్మెతలో చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం సందర్భంగా ఈ నెల 17న సేద్యపు ఎద్దుల కేటగిరిలో రాతి దూలం లాడుగు పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. పోటీల్లో పాల్గొను ఎద్దుల యజమానులు 6301931092 నంబర్‌కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు.

బైక్ బోల్తా -ఒకరికి గాయాలు

గుత్తి: పట్టణంలోని శ్రీసాయి డిగ్రీ కాలేజీ సమీపంలోని స్పీడ్ బ్రేకర్ వద్ద గురువారం బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. ఘటనలో రామాంజనేయులు అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. గుత్తి అనంతపురం గ్రామానికి చెందిన రామాంజనేయులు బైక్‌లో పని మీద లచ్చానపల్లికి వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. గాయపడిన రామాంజనేయులును స్థానికులు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

యువకుడి మృతి

గుత్తి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు మృతిచెందాడు. వివరాలు.. పట్టణంలోని అనంతపురం రోడ్డులో ఈనెల 6న రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ప్రవీణ్, సురేష్ గాయపడిన విషయం తెలిసిందే. ప్రవీణ్‌ను అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

గరుడ వాహనంపై వేంకటరమణుడి దర్శనం



రాయదుర్గంటౌన్: ప్రసన్న వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం కల్యాణోత్సవం అనంతరం సాయంత్రం పద్మావతి అమ్మవార్ల సమేతంగా గరుడ వాహనంపై శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు. గరుడ వాహన అలంకరణపై స్వామి ఉత్సవ విగ్రహం పక్కన వివాహం జరిపించిన బాలిక పద్మావతి (శ్రీధన్య)ని కూర్చోబెట్టి ఊరేగించారు. పద్మశాలియ బహుత్తమ సంక్షేమ సంఘం, తొగట వీరక్షత్రియ సంఘం, స్వకులసాలె(హటకేశ్వరస్వామి ఆలయం), భావసార క్షత్రియ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన గరుడ వాహనోత్సవం ఆలయం వద్ద నుంచి వినాయక సర్కిల్, బళ్లారి రోడ్డు, బొడ్డు రాయి వరకు ఊరేగించారు. శుక్రవారం స్వామి వారి గజేంద్రవాహనోత్సవం జరుగుతుందని ఆలయ ఈఓ నరసింహారెడ్డి తెలిపారు.

17న శ్రీవారి బ్రహ్మరథోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో ప్రధాన ఘట్టమైన వేంటకరమణస్వామి బ్రహ్మోరథోత్సవం 17న నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటలకు మడుగుతేరు, సాయంత్రం 4 గంటలకు బ్రహ్మ రథోత్సవం జరుగుతుందని ఈఓ నరసింహారెడ్డి తెలిపారు.